
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



వికారాబాద్ - మేడ్చల్

జిల్లాల వార్తలు

5

శనివారం 10 మే 2025





వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులతో డీఈవో రేణుకాదేవి

శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

దుద్యాల, మే 9(ఆంధ్రజ్యోతి): వేసవి శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని డీఈవో రేణుకాదేవి అన్నారు. శుక్రవారం దుద్యాల మండలంలోని చిలుముల్‌మైలారం పాఠశాలను సందర్శించారు. శిక్షణ తరగతులు విద్యార్థులకు ఆసక్తి పెంచేవిధంగా ఉండాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఫలితాలు సాధించే విధంగా కృషి చేయాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు ఏఐలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కంప్యూటర్ పరిజ్ఞానంతో పదాలను నేర్చుకోవడం, పదాలను పలకడం, సరైన పదాలను గుర్తించడంలో ఏఐ బోధన ఉపయోగపడుతుందన్నారు. శిక్షణ శిబిరాల్లో చదువుతో పాటు డ్యాన్స్, గేమ్స్, డ్రాయింగ్ వంటివి విద్యార్థులకు నేర్పించాలన్నారు. ఆమె వెంట ఎంఈవో విజయరామారావు, ప్రధానోపాధ్యాయుడు యాదయ్య, ఉపాధ్యాయులు ఆంజనేయులు, సంగమేశ్, గోవర్ధన్, అనిల్, హనుమంతు, దివ్యశ్రీ, కవిత తదితరులు పాల్గొన్నారు.

ఎర్రెర్ర దారిలో..



విరబూసిన ఎరుపు వర్ణం పూలు మంత్రముగ్ధులను చేస్తున్నాయి. కోట్‌పల్లి పరిధిలోని అన్నసాగర్, ఒగులపూర్ మధ్య తాండూర్, సదాశివపేట్, ప్రధాన రోడ్డుకు ఇరువైపులా ప్రభుత్వం ఉపాధిహామీ కింద నాటిన మంకెన్ మొక్కలు ఏపుగా పెరిగి ఎర్రని పూలతో ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. ఈ చెట్లు ఒకసారి పూలతో, మరోసారి పచ్చదనంతో ఆకట్టుకోవడం విశేషం. వాహనదారులు ఎండలో ప్రయాణం చేసి ఇక్కడకు రాగానే కాసేపు సేదతీరి తిరిగి వెళ్లిపోతున్నారు.

కోట్‌పల్లి, మే 9(ఆంధ్రజ్యోతి)

మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ ఉమాగౌరి

గర్భిణులకు మెరుగైన వైద్య సేవలందించాలి

మేడ్చల్ టౌన్, మే 9(ఆంధ్రజ్యోతి): గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఉమాగౌరి అన్నారు. శుక్రవారం మేడ్చల్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సిబ్బందితో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆస్పత్రికి వైద్యం కోసం వచ్చే గర్భిణులు, చిన్న పిల్లలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ప్రతీ రోజు వచ్చే ఓపీ పేషెంట్లకు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. అత్యవసర వైద్య సేవలు అందించడానికి సిబ్బంది ఎల్లవేళల సిద్ధంగా ఉండాలని సూచించారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో పనిచేసే సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా హెల్త్ సర్వీసెస్ కోఆర్డినేటర్ డాక్టర్ సునీత తదితరులు పాల్గొన్నారు.



'సదరం'నకు సకాలంలో

హాజరుకావాలి

వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, మే 9 (ఆంధ్రజ్యోతి): వైకల్యం ఉన్న వారు స్లాట్ బుక్ చేసుకున్న మెసేజ్ ప్రకారం సదరం క్యాంపులకు సకాలంలో హాజరు కావాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ పేర్కొన్నారు. జిల్లాలో సదరం/యూడీఐడీ ద్వారా మే మాసంలో వివిధ వైకల్యం ఉన్న వారికి వికారాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ నెల 13, 16, 21వ తేదీల్లో అంగవైకల్యం ఉన్నవారు, 23న చెవుడు, మూగ, 27వ తేదీన అంధులు, తక్కువ చూపు కలవారు, అదేవిధంగా 29వ తేదీన బుద్ధి మాంద్యం, మానసిక వైకల్యం గల సభ్యులకు క్యాంపులు ఉంటాయని వివరించారు. రెన్యూవల్‌కు సంబంధించి డీఆర్డీఏ కార్యాలయంలో మే 12వ తేదీన సంప్రదించాలని కోరారు.



మట్టి విగ్రహాలే జీవనాధారం

నిరుడు వ్యాపారంలో తీరని నష్టం

అప్పుల ఊబిలో తయారీదారులు

ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూపులు

8



పాఠ్య పుస్తకాలు రెడీ

విద్యార్థులకు వంద శాతం పంపిణీ చేసేలా చర్యలు

ఇప్పటికే మేడ్చల్ జిల్లాకు 70 శాతం పుస్తకాలు చేరిక

మొదటి విడతలో 5,49,630 అవసరం


పాఠశాలలకు అందినవి 3,97,330 పుస్తకాలు

స్కూళ్ల ప్రారంభం రోజున అందించేందుకు కసరత్తు

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్కూళ్ల ప్రారంభమయ్యే రోజున పుస్తకాలు అందించేందుకు విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గత విద్యాసంవత్సరంలో పాఠ్య పుస్తకాలు పూర్తిస్థాయిలో అందకపోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అలాంటి పరిస్థితి ఇప్పుడు రావొద్దని ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. ఈ ఏడాది 2వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులకు ద్విభాషా పుస్తకాలు(ఒకే పుస్తకంలో ఒకవైపు ఇంగ్లిష్ మీడియం, మరోవైపు తెలుగు మీడియం పాఠాలు) అందించనున్నారు. పేజీల సంఖ్య, బరువు పెరుగడంతో ఆప్షన్స్ సబ్జెక్టులను(మ్యాథ్స్, సైన్స్, సోషల్) పార్ట్ 1, పార్ట్ 2గా విభజించి విద్యార్థులకు అందించనున్నారు. మొదటి విడతగా పార్ట్ - 1 పుస్తకాలు బడులు ప్రారంభోత్సవం రోజు జూన్ 12న విద్యార్థులకు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. పార్ట్ - 2 పుస్తకాలను అక్టోబర్‌లో ఇవ్వనున్నారు.



జిల్లాకు చేరుకున్న పుస్తకాలను పరిశీలిస్తున్న అధికారులు



మేడ్చల్ ప్రతినిధి, మే 9(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలతో పాటు కేజీబీవీ, రెసిడెన్షియల్, మైనార్టీ గురుకులాల్లో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు చదివే మొత్తం విద్యార్థులు 85 వేల మంది ఉన్నారు. వీరికి 7,72,000 పుస్తకాలు అవసరం. ఇప్పటివరకు జిల్లాకు 70 శాతం పుస్తకాలు చేరాయి. జూన్ 12 వరకు వంద శాతం పుస్తకాలు వచ్చే విధంగా అధికారులు ప్రయత్నం చేస్తున్నారు. వచ్చిన పుస్తకాలను ఆయా మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు పంపించేందుకు

మిగతా 8వ పేజీలో...

స్కూళ్ల ప్రారంభం రోజునే పంపిణీ



ఈ విద్యా సంవత్సరం బడులు ప్రారంభమైన రోజున విద్యార్థుల చేతిలో పుస్తకాలు ఉండేవిధంగా చర్యలు తీసుకుంటున్నాం. మొదటి విడతలో 70 శాతం వరకు పుస్తకాలు వచ్చాయి. ఇంకో పది రోజుల్లో వంద శాతం పుస్తకాలు వస్తాయి. వీటిని జూన్ 11లోపు అన్ని పాఠశాలలకు చేరవేస్తాం. రెండో విడత పుస్తకాలు అక్టోబర్‌లో అందిస్తాం.

- విజయకుమారి, డీఈవో



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

ధాన్యం సేకరణలో వేగం పెంచాలి

» **వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్**

పరిగి, మే 9 (ఆంధ్రజ్యోతి): రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా వరి ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. శుక్రవారం పరిగి మున్సిపల్ పరిధిలోని సుల్తాన్‌పూర్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. రైతులు, ఏజెన్సీ నిర్వాహకులతో మాట్లాడారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటవెంటనే మిల్లులకు తరలించాలని సూచించారు. జిల్లాలో 128 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని సేకరిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 13,425 మంది రైతుల దగ్గర కొనుగోలు చేశామని, రైతుల ఖాతాల్లో రూ.12.88 కోట్లు జమ చేశామని చెప్పారు. వర్షాలు కురిసే అవకాశాలు ఉన్న కారణంగా కేంద్రంలో నిల్వ ఉంచుకోకుండా ఎప్పటికప్పుడు తరలించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్‌వో మోహన్‌బాబు, డీఎం మోహనకృష్ణ; డీసీఎమ్మెస్ పరిగి ఇన్‌చార్జి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు కలగొద్దు

» **మేడ్చల్ అదనపు కలెక్టర్ హరిప్రియ**



అలియాబాద్ కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ హరిప్రియ

శామీర్‌పేట, మే 9 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తనీయొద్దని మేడ్చల్ అదనపు కలెక్టర్ హరిప్రియ నిర్వాహకులు, సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం శామీర్‌పేట, అలియాబాద్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా మేనేజర్ సుగుణాబాయితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులతో మాట్లాడి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం విక్రయించిన రైతులకు 24 గంటల్లో వారి ఖాతాల్లో డబ్బులు చేయాలని ఆదేశించారు. రైతులు సైతం ధాన్యాన్ని తూర్పార బట్టి, ఆరబెట్టి తీసుకురావాలని, కేంద్రాల్లో అవసరమైన హమాలీలు ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కేంద్రాల వద్ద తాగునీటి సౌకర్యాన్ని కల్పించాలని ఇన్‌చార్జికి కోరారు. కార్యక్రమంలో ఆర్డీవో ఉపేందర్, తహసీల్దార్ యాదగిరిరెడ్డి ఉన్నారు.

కొనుగోళ్లలో జాప్యం

గన్నీ బ్యాగుల కొరత.. నిలిచిన ధాన్యం తూకాలు

మూడు రోజులుగా అన్నదాతల అవస్థలు

ధాన్యం సేకరణలో ప్రతి ఏడాదీ ఇదే తంతు

సమస్యలను పట్టించుకోని అధికారులు



గన్నీ బ్యాగులు లేక బొంరాస్‌పేట్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో వడ్ల రాశులు

బొంరాస్‌పేట్, మే 9 (ఆంధ్రజ్యోతి): రోజూ ఎక్కడో ఓచోట వర్షం పడుతూనే ఉంది. ధాన్యం కొనుగోళ్లలో జాప్యం జరుగుతోంది. ఫలితంగా అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. గన్నీ బ్యాగుల కొరతతో మూడు రోజులుగా ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోయాయి. వికారాబాద్ జిల్లాలోనే అతి పెద్ద వరి ధాన్యం కొనుగోలు కేంద్రం బొంరాస్‌పేట్ ఐకేపీ కేంద్రంలో బుధవారం నుంచి గన్నీ బ్యాగుల కొరత వెంటాడుతోంది. దీంతో కొనుగోళ్లు నిలిచిపోయాయి. కేంద్రానికి మొదట్లో 15 వేల బ్యాగులు అవసరం ఉండగా తొమ్మిది వేలు మాత్రమే పంపించారు. అవి వచ్చిన వారం

మిగతా 8వ పేజీలో...

ముందస్తు ప్రణాళిక లేక..

కొడంగల్ నియోజకవర్గం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఉన్న సమయంలో ఇలాంటి ఇబ్బందులు ఉండేవి కావని కేంద్రాల నిర్వాహకులు, రైతులు చెబుతున్నారు. 20 ఏళ్ల క్రితమే బొంరాస్‌పేట్ మండలంలో కొనుగోలు కేంద్రం ఉండేది. అప్పట్లో 47 గ్రామాల రైతులు ధాన్యాన్ని బొంరాస్‌పేట్ మండల కేంద్రానికి తీసుకువచ్చేవారు. సరైన సమయంలో బస్తాలు అందించడం, లారీలు రావడంతో కొనుగోళ్లు సాఫీగా సాగేవి. వికారాబాద్ జిల్లాలో విలీనమైన అనంతరం ప్రతీ సంవత్సరం ఈ కేంద్రానికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. అధికారులు ముందస్తు చర్యలు చేపట్టకపోవడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు స్పందించి కేంద్రానికి అవసరం మేరకు గన్నీ బ్యాగులు సమకూర్చి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

సర్వేయర్ల శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, మే 9 (ఆంధ్రజ్యోతి): లైసెన్స్‌డ్ సర్వేయర్ల శిక్షణకు అర్హులైన అభ్యర్థులు మే 17లోపు దరఖాస్తు చేసుకోవాలని వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ పేర్కొన్నారు. భూ భారతి చట్టం 2025ను ఏప్రిల్ 14న ప్రారంభించినట్లు తెలిపారు. ఇంటర్ గణితంలో 60శాతం మార్కులు వచ్చి ఉండాలని, బీటెక్ సివిల్ అర్హత కలిగిన అభ్యర్థులు మే 17 వరకు మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రెవెన్యూ పరిపాలనకు సర్వే, ల్యాండ్ రికార్డ్స్ విభాగాలకు సహాయంగా రాష్ట్రంలోని దాదాపు 5000 మంది లైసెన్స్ పొందిన సర్వేయర్లకు శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం యోచిస్తోందని, లైసెన్స్‌డ్ సర్వేయర్ల శిక్షణ కోసం అర్హత గల అభ్యర్థుల నుంచి తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్మెంట్(తాలిమ్) దరఖాస్తులను ఆహ్వానిస్తుందని పేర్కొన్నారు. అన్ని మీ సేవ కేంద్రాల్లో రూ.100 చెల్లించి దరఖాస్తు, ప్రాస్పెక్టస్ పొందవచ్చన్నారు. మీసేవ కేంద్రాల్లోనే ఈ నెల 17వ తేదీ వరకు దరఖాస్తు సమర్పించాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు జిల్లాలోని ప్రధాన కేంద్రాల్లో మే 26 నుంచి జూలై 26 వరకు 50 రోజుల పని దినాల్లో శిక్షణ ఉంటుందని, ఇందుకు ఓసీ అభ్యర్థులు రూ.10 వేలు, బీసీ అభ్యర్థులు రూ.5 వేలు, ఎస్సీ, ఎస్టీ, అభ్యర్థులు రూ. 2500 ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

'కోట్‌పల్లి' ఆధునికీకరణకు రూ.90 కోట్లు

» రెండు రోజుల్లో జుంటుపల్లి ప్రాజెక్టు ఆధునికీకరణకు జీవో

» తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి





తాండూరు, మే 9(ఆంధ్రజ్యోతి): కోట్‌పల్లి ఇరిగేషన్ ప్రాజెక్టు ఆధునికీకరణ కోసం రూ.90 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం జీవో నంబర్ 88 జారీ చేసిందని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో వివరాలు వెల్లడించారు. 1969లో ఏర్పాటైన కోట్‌పల్లి జలాశయాన్ని ఆధునీకరించకపోవడంతో 9,300 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే ప్రాజెక్టు ప్రస్తుతం 4,000 ఎకరాలకు కూడా సక్రమంగా నీరందించడం లేదన్నారు. వెంటనే టెండర్లు వేసి పనులు ప్రారంభిస్తామని తెలిపారు. సాగునీటి కాలువలను ఆధునీకరిస్తామని, చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తామని చెప్పారు. జుంటుపల్లి ప్రాజెక్టు ఆధునికీకరణ కోసం రూ.8 కోట్ల మంజూరుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిందని, రెండు రోజుల్లో జీవో వస్తుందన్నారు. తాండూరు పట్టణంలోని గొల్లచెరువులోకి మురుగునీరు రాకుండా మురుగునీటిని దారి మళ్లించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇప్పటికే చెరువుకు సంబంధించిన పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. తాండూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ కోసం నిధులు మంజూరై పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. అగ్గనూర్ నుంచి బషీరాబాద్, బండమీదిపల్లి నుంచి నీళ్లపల్లి, బషీరాబాద్ నుంచి నీళ్లపల్లి వరకు రోడ్డు పనులు కొనసాగుతున్నాయన్నారు. 1960లో తాండూరు పట్టణంలో వేసిన తాగునీటి పైప్ లైన్ స్థానంలో కొత్తగా పైప్‌లైన్ వేసేందుకు రూ.54 కోట్లు మంజూరయ్యాయని, త్వరలో ఈ పనులకు సంబంధించి టెండర్లు పిలుస్తామన్నారు. తాండూరు, వికారాబాద్ రోడ్ల పనులు త్వరలో పనులు ప్రారంభం కానున్నాయని తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సంపత్‌కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

జవాన్లకు అండగా ఉంటాం

సిందూర్ ఆపరేషన్ తర్వాత జవాన్ల పోరాటం అభినందనీయమని, రాజకీయాలకు అతీతంగా ప్రతీ ఒక్కరు జవాన్లకు అండగా నిలవాలని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కోరారు. వారు దేశం కోసం చేస్తున్న సేవలు మరువలేనివని పేర్కొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త

ఎరువుల వాడకం తగ్గించాలి

● వ్యవసాయశాఖ శాస్త్రవేత్తలు

మేడ్చల్‌టౌన్, మే 9 (ఆంధ్రజ్యోతి) ఎరువుల వాడకం తగ్గించి నేల తల్లి కలుషితం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రతీ రైతుపై ఉందని ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయశాఖ శాస్త్రవేతలు అన్నారు. మండలంలోని మేడ్చల్, రాయిలాపూర్, గుండ్లపోచంపల్లి, అక్బర్జపేట గ్రామాల్లో రైతుల ముంగిట శాస్త్రవేతలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో నిర్వహించిన పలువురు శాస్త్రవేతలు మాట్లాడుతూ.. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి ఆరోగ్యకర పంటలను పండించాలన్నారు. వ్యవసాయంలో సాగు నీటి పొదుపు ఉండాలని, సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రజ్ఞులు డాక్టర్ వి. వరప్రసాద్, డాక్టర్ వసంత, డాక్టర్ పుష్పవల్లి తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల కుటుంబాలకు అండగా నిలవాలి

- వీరజవాన్లు మురళీనాయక్, సచిన్‌యాదవ్‌లకు ఘన నివాళి
- మైసిగండిలో భారత సైన్యానికి మద్దతుగా ర్యాలీ
- పెద్ద సంఖ్యలో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు, గిరిజనులు

కడ్తాల్, మే9(ఆంధ్రజ్యోతి): దేశంకోసం ప్రాణాలర్పించిన అమరవీరుల కుటుంబాలకు దేశ ప్రజలంతా అండగా నిలవాలని పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డిలు పిలుపునిచ్చారు. పాకిస్థాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో వీరమరణం పొందిన మురళీనాయక్, సచిన్‌యాదవ్‌లకు శుక్రవారం కడ్తాల మండలం మైసిగండి గ్రామంలో సంతాప కార్యక్రమాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్, యువజనకాంగ్రెస్ మాజీ మండలాధ్యక్షుడు హీరాసింగ్, కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకుడు జవహర్‌లాల్ నాయక్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ నాయకులు, కార్యకర్తలు, గిరిజన యువకులు పెద్దసంఖ్యలోపాల్గొన్నారు. మురళీనాయక్, సచిన్ యాదవ్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేసినివాళులర్పించారు.హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించి భారత సైన్యానికి సంఘీభావం ప్రకటించారు. శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్ రెడ్డిలు మాట్లాడుతూ పాకిస్థాన్‌తో భారత సైన్యం వీరోచితంగా పోరాడుతోందని కొనియాడారు. యువజన కాంగ్రెస్ తాలుకా అధ్యక్షుడు దళపతి గౌడ్, నాయకులు తులసీరామ్ నాయక్, కిషన్‌నాయక్, సీతారామ్, ప్రవీణ్, నర్సింహ, జగన్, అంజనేయులు, బాబులాల్, భీమ్‌జీ, రమేశ్, గోపాల్, మల్య, హర్య, శంకర్, లస్కర్ నాయక్ పాల్గొన్నారు.

మురళీనాయక్ త్యాగం మరువలేనిది

షాద్‌నగర్ అర్బన్: పాకిస్థాన్‌తో పోరాటంలో వీరమరణం చెందిన జవాన్ మురళీనాయక్ త్యాగం దేశం మరువబోదని లంబడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ముడావత్ రాంబల్‌నాయక్ అన్నారు. ఈమేరకు శుక్రవారం రాత్రి రాంబల్‌నాయక్ ఆధ్వర్యంలో షాద్‌నగర్ చౌరస్తాలో కొవ్వొత్తులను వెలిగించి, మురళీనాయక్‌కు నివాళులర్పించారు. రాంబల్‌నాయక్ మాట్లాడుతూ మురళీనాయక్ కుటుంబానికి భారత ప్రజలు, ప్రభుత్వాలు అండగా ఉంటారని అన్నారు. పాకిస్థాన్ కవ్వింపు చర్యలకు దీటుగా జవాబు ఇస్తున్న భారత సైన్యానికి కులమతాలకతీతంగా భారతీయులందరూ అండగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు రామావత్ రాజునాయక్, లక్ష్మణ్‌నాయక్, భద్రునాయక్, చందునాయక్, అయోధ్య శ్రీనివాస్‌నాయక్, చందర్‌నాయక్, పరుశురాంనాయక్, అంబదాస్‌నాయక్, రవినాయక్ పాల్గొన్నారు.


మైసిగండిలో అమరవీరులకు నివాళులర్పిస్తున్న నాయకులు



మురళీ నాయక్‌కు నివాళులర్పిస్తున్న ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు

ఇండో గ్లోబల్ అవార్డు గ్రహీతకు సన్మానం

పరిగి, మే9 (ఆంధ్రజ్యోతి): ఇండోగ్లోబల్ అవార్డు గ్రహీత దోమ మండలం బొంపల్లి పాఠశాల హెచ్ఎం ఎండీ షఫీని ముస్లిం, మైనార్టీ ఎంప్లాయిస్ వర్కింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఎంఈడబ్ల్యుఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మోహిజ్‌ఖాన్, ఎండీ జహంగీర్, ప్రధానోపాధ్యాయులు ఎండీ ఉస్మాన్‌అలీలు మాట్లాడుతూ ఈ అవార్డును అందుకోవడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ ఉద్యోగుల సంఘం నాయకులు నజీర్, ఇసాక్, ఖాజాషరీఫ్, ఇబ్రహీం, కాసీం, జలాల్ ఉన్నారు.


హెచ్ఎం షఫీని సన్మానిస్తున్న సంఘం నాయకులు

ప్రైవేట్ భూముల విలువ ప్రకారం

పరిహారం చెల్లించాలి

● గ్రామసభలో అధికారులను కోరిన భూనిర్వాసితులు




గ్రామసభలో మాట్లాడుతున్న శ్యాంప్రకాశ్

శామీర్‌పేట, మే9 (ఆంధ్రజ్యోతి): రాజీవ్‌రహదారి విస్తరణలో తూంకుంట పరిధిలో ప్రైవేట్ భూముల విలువ ప్రకారం నష్టపరిహారాన్ని చెల్లించి ఆదుకోవాలని భూనిర్వాసితులు అధికారులను కోరారు. జేబీఎస్ నుంచి తూంకుంట ఓఆర్ఆర్ జంక్షన్ వరకు ప్రభుత్వం తలపెట్టిన ఎలివేటెడ్ కారిడార్ రాష్ట్ర రాజీవ్ రహదారి రోడ్డు విస్తరణలో స్థలాలు, ఇళ్లను కోల్పోతున్న భూనిర్వాసితులతో శుక్రవారం తూంకుంట, హకీంపేటలో అదనపు కలెక్టర్ హరిప్రియ ఆధ్వర్యంలో పునరావాసానికి సంబంధించి గ్రామసభలను నిర్వహించారు. రాజీవ్‌రహదారి రోడ్డు విస్తరణ కోసం 200 ఫీట్ల స్థలాన్ని కేటాయించకుండా 100 ఫీట్ల మేరకే తగ్గించి రోడ్డును వెడల్పు చేయాలని భూనిర్వాసితులు అధికారులను కోరారు. ఓ ప్రక్క రాజీవ్‌రహదారి విస్తరణలో ఇళ్లను, స్థలాలను కోల్పోతున్న బాధలో తాముంటే తూంకుంట మున్సిపల్ అధికారులు పన్నులను చెల్లించాలని వేధిస్తున్నారని పలువురు భూ నిర్వాసితులు మొరపెట్టుకున్నారు. అదనపు కలెక్టర్ హరిప్రియ మాట్లాడుతూ రాజీవ్‌రహదారి విస్తరణలో భూ నిర్వాసితుల సమస్యలను, సందేహాలను ప్రభుత్వానికి నివేదించి పరిష్కారానికి తగు చర్యలను తీసుకుంటామని భరోసా ఇచ్చారు. అదేవిధంగా సభలో జిల్లా భూసేకరణ ఇన్‌చార్జి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్యాంప్రకాశ్, భూసేకరణ ఇన్‌చార్జి తహసీల్దార్ విజయకుమార్, మండల తహసీల్దార్ యాదగిరిరెడ్డిలు మాట్లాడుతూ ప్రభుత్వ నియమ నిబంధనలను వివరించారు.


ఎన్డీఎఫ్‌కు ఆర్బీఎల్ విరాళం

తాండూరు, మే9 (ఆంధ్రజ్యోతి): దేశం కోసం మేముసైతం అంటూ తాండూరు ఆర్బీఎల్ సీఈవో శ్రీనివాస్‌రెడ్డి, ఉద్యోగులు ముందుకొచ్చారు. సైనిక కుటుంబాల సంక్షేమానికి జాతీయ రక్షణ నిధికి రూ.2 లక్షలు విరాళాన్ని అందజేశారు. భారత సైనిక కుటుంబాల సంక్షేమం కోసం భారతసైన్యం ఏర్పాటు చేసిన ఎన్డీఎఫ్‌కు తన బాధ్యతగా ఈవిరాళాన్ని అందజేసినట్లు ఆర్బీఎల్ సీఈవో బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.



















మామిడి ఘుమఘుమలు

జిల్లాలోని మార్కెట్లలో జోరుగా మామిడి పండ్ల విక్రయాలు.. తగ్గిన ఉత్పత్తులు.. ప్రియంగా ధరలు

పరిగి, మే 9 (ఆంధ్రజ్యోతి): నోరూరించే బంగినపల్లి మామిడి పండుకు మార్కెట్‌లో ఎంత పేరుందో... రాజధాని శివారులోని పూడూరు బేనిషాన్‌కు అంతే పేరుందనడం అతిశయోక్తి కాదు. సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండే పండ్లలో ప్రధానమైనది మామిడి పండు. వేసవిలో నోరూరించే పండుగా భావిస్తున్న మామిడి పండు తినాలని ప్రతిఒక్కరూ ఆసక్తి చూపుతారు. మాటు వేసిన మామిడి పండ్ల ప్రాంతలో గుమగుమ వాసనలు వెదజల్లుతాయి. జిల్లాలోని 20మండలాల్లో మామిడి పండ్ల విక్రయాలు జోరుగా జరుగుతున్నాయి. గత పదేళ్ల నుంచి జిల్లాలో మామిడి తోటల పెంపకం పెరుగుతున్నది. ఏరైతు చూసినా తమకు ఉన్న పొలంతో కొంతనైనా మామిడి తోటలను పెంచాలని మొగ్గు చూపుతున్నారు. ప్రస్తుతం పరిగి, వికారాబాద్, తాండూరు మార్కెట్లలో మామిడి పండ్ల విక్రయాలు జరుగుతున్నాయి. జిల్లాలో ప్రధానంగా పూడూరు మామిడి తోటలకు ప్రసిద్ధిగా చెప్పుకోవచ్చు. ఇక్కడ పండించిన పండ్లను రాజధాని హైదరాబాద్ నగరమే కాకుండా రంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్ జిల్లాలోని మార్కెట్‌లలో కూడా పూడూరు ఎంతో ప్రసిద్ధి. మామిడి పూత వచ్చే సమయంలో అనుకూలించని కాలం కారణంగా ఈసారి కాత ఆశించిన విధంగా లేక ధరలు కూడా భగ్గుమంటున్నాయి. జిల్లాలోని ఒక్క పూడూరు మండలంలో నాలుగు వేల ఎకరాల్లో సాగు ఉండగా, మిగతా మండలాల్లో మరో 10వేలకుపైగా మామిడి తోటలు సాగులో ఉంది.



మామిటి పండ్లకు కేరాఫ్ పూడూరు

జిల్లాలోనే మామిడిపండ్లకు పూడూరు మండలమే కేరాఫ్‌గా నిలుస్తున్నది. ఇందులో ముఖ్యంగా పూడూరు మండలం పూడూరు, మన్నెగూడ, రాకంచర్ల, పెద్ద ఉమ్మెంతాలలో మామిడి తోటలో అనేక రకాల పండ్లు లభ్యమవుతాయి. రాకంచర్లతోట నుంచి మామిడి పండ్లను హైదరాబాద్‌తో పాటు, ఇతర రాష్ట్రాలకు తరలిస్తారు.

మార్కెట్‌లో లభిస్తున్న పండ్లు

ఫలాల్లో రారాజు అయిన మామిడి గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది కాపు తక్కువగా ఉంది. దీంతో ధరలు కాస్త ఎక్కువగా ఉన్నాయి. ఈ ఏడాది రకాలను బట్టి కిలో చొప్పున రూ.100 నుంచి రూ.180ల వరకు పలుకుతోంది. హిమాయత్-160, కేసరి-90, గోవా-90, మహిముద-100, పంచదార-90, బేనిషాన్-90, ఆపూస్-90, పెద్దరసాలు-100, చిన్నరసాలు-90, సపేద-90, జాంగీర్-90, దశరిమహిముద-90, చెరకు రసాలు-90, మల్గోబా90, మంజీర-90, మలెక-90, లంగ్డ-90, తోటాపరి-90 రూపాయలు పలుకుతున్నాయి.



పూడూరు మన్నెగూడలో మామిడిపండ్ల అమ్మకాలు

మామిడి పండ్ల ధరలు పెరిగాయి



ఈసారి మామిడి పండ్ల ధరలు భగ్గుమంటున్నాయి. గతేడాది కంటే ఈసారి కిలోపై రూ.30 నుంచి రూ.50లు ఎక్కువగా ఉన్నాయి. పరిగి మార్కెట్‌లో కిలో రూ.150ల వరకు విక్రయిస్తున్నారు. ధరలను చూస్తే ఆలోచించాల్సి వస్తుంది.

- విజయలక్ష్మి, పరిగి

కార్బైడ్‌తో మాగిన పండ్లు తినొద్దు



మామిడి పండ్లు మంచి కలర్‌లో కనిపించడానికి కార్బైడ్‌తో పాటు, ఇతర రసాయనాలు వాడుతున్నారు. ఇలా రసాయనాలు చల్లిన మామిడి పండ్లను తినడం ద్వారా రోగాలపాలయ్యే అవకాశం ఉంది. ముఖ్యంగా వేసవిలో ఇలాంటి పండ్లు తినడం వల్ల విరేచనాలకు గురికావచ్చు. ఇతర దీర్ఘకాలిక వ్యాధులు కూడా రావొచ్చు. కార్పెట్‌తో కాకుండా నేచురల్‌గా లభించే పండ్లనే తినాలి.

- డాక్టర్ ప్రవీణ్‌కుమార్, పరిగి



గ్రామస్తులతో మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి జయసుధ

సిటిజన్ లాగిన్ విన్నపాలపై స్పందించాలి

- జిల్లా పంచాయతీ అధికారి జయసుధ
- అగ్గనూరు, దేవనూరు పంచాయతీల తనిఖీ

యాలాల, మే 9, (ఆంధ్రజ్యోతి): సిటిజన్ లాగిన్‌లలో వచ్చిన విన్నపాలను ఆలస్యం చేయకుండా స్పందించి పరిష్కరించాలని జిల్లా పంచాయతీ అధికారి జయసుధ ఆదేశించారు. మండలంలోని అగ్గనూరు, దేవనూరు పంచాయతీలను శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పంచాయతీ కార్యాలయాల్లోని రికార్డులను పరిశీలించారు. అనంతరం జయసుధ మాట్లాడుతూ సేంద్రియ ఎరువులను శాస్త్రీయంగా తయారు చేసే మొక్కల పెంపకాలకు, వివిధ పంటలకు, కూరగాయల పంటలకు ఉపయోగించాలని సూచించారు. అధికంగా ఎరువులు తయారు చేసి హైదరాబాద్‌తోపాటు ఇతర పట్టణ ప్రాంతాలకు సరఫరా చేయాలని పంచాయతీ కార్యదర్శులకు, అధికారులకు సూచించారు. రికార్డులు ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో ప్రజలకు తడి, పొడి చెత్త వేర్వేరు చేయించే విధానంగా అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల వెరిఫికేషన్‌లో పాల్గొన్నారు. గ్రామంలో అర్హులైన వారిని గుర్తించి ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులను గుర్తించాలన్నారు. మండలంలో కొత్తగా పేర్కంపల్లితండా, దేవులతండాలో కంపోస్టు నిర్మాణానికి తీర్మానాలను పంపాలని ఆదేశించారు. ఎంపీడబ్ల్యూ వర్కర్లతో పంచాయతీ అధికారి మాట్లాడుతూ ఇనూరెన్స్ చేయించుకోవాలని సూచించారు. అదేవిధంగా ఆలస్యం కాకుండా వేతనాలు చెలల్లించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పుష్పలీల, వ్యవసాయాధికారి శ్వేత, పంచాయతీ కార్యదర్శులు రమాదేవి, పావని, సుధాకర్, తారకాచారి పాల్గొన్నారు.

నాలుగు బ్లాకులుగా 'మహేశ్వరం కాంగ్రెస్'

- బ్లాక్-1లో ఆర్కేపురం, సరూర్‌నగర్, 2లో మీర్‌పేట్, బడంగ్‌పేట్ 3లో తుక్కుగూడ, జల్‌పల్లి, 4లో మహేశ్వరం, కందుకూరు



మహేశ్వరం, మే 9(ఆంధ్రజ్యోతి): మహేశ్వరం నియోజకవర్గాన్ని పార్టీపరంగా నాలుగు బ్లాకులుగా విభజించామని మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం ఇన్‌చార్జి కేఎల్లార్ తెలిపారు. జీహెచ్ఎంసీలోని సరూర్‌నగర్, ఆర్కేపురం డివిజనల్లను కలుపుకొని మొదటి బ్లాకుగా, మీర్‌పేట్, బడంగ్‌పేట్ రెండో బ్లాకు, తుక్కుగూడ, జల్‌పల్లి మున్సిపాలిటీలను కలుపుకొని మూడో బ్లాకు, మహేశ్వరం, కందుకూరు మండలాలను కలుపుకొని నాలుగవ బ్లాకుగా విభజించామని ఆయన తెలిపారు. పార్టీ కోసం కష్టపడే ప్రతీ కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకోవడంతో పాటు పదవుల పంపకంలో కాంగ్రెస్ పైరవీలను ప్రోత్సహించదన్నారు. ఈమేరకు తుక్కుగూడలోని పార్టీ కార్యాలయంలో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రజల కోసం, పార్టీ బలోపేతానికి కష్టించి పనిచేయాలనుకొని ముందుకెళ్లేవారు పార్టీ అధ్యక్ష బ్లాక్, డివిజన్, మండల, గ్రామ శాఖల అధ్యక్షులతో పాటు ఇతరాత్రాఆ పదవులను ఆశించే నాయకులు, కార్యకర్తలు నియోజకవర్గాన్ని నాలుగు బ్లాకులుగా విభజించిన విషయాన్ని గమనించాలన్నారు. ఈమేరకు పదవులు ఆశించే వారు పార్టీ కార్యాలయంలో తమ పేర్లతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పార్టీ ఆదేశాలను కాదని.. పైరవీలతో ఎవరు ముందుకు వెళ్లినా.. ఎలాంటి పదవులు రావనే విషయాన్ని గమనించాలన్నారు. పార్టీకోసం పనిచేసే వారికి పదవులు తగిన సమయంలో తప్పకుండా వస్తాయని కేఎల్లార్ ఈ సందర్భంగా తేల్చి చెప్పారు.



తుర్కగూడ ఎస్సీ కమ్యూనిటీ భవనం వెనకాల గుంత ఇలా..

పొంచి ఉన్న ప్రమాదం!

ఆదిభట్ల, మే 9(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని తుర్కగూడ గ్రామంలో ఇటీవల తాగునీటి పైపులైన్ నిర్మాణం చేపట్టారు. పనులు పూర్తయ్యి నెలరోజులు గడుస్తున్నా ఎస్సీ కమ్యూనిటీ భవనం వెనకాల తవ్విన గుంతను కాంట్రాక్టరు పూడ్చలేదు. దాంతో గుంత ప్రమాదకరంగా మారింది. ప్రభుత్వం చర్లపటేల్‌గూడ నుంచి రాచులూర్ వరకు కొత్తగా రోడ్డు నిర్మాణం చేపట్టాడంతో తుర్కగూడ, కప్పాడు గ్రామాలకు చెందిన ప్రజలు ఎర్రగుంట రోడ్డు నుంచి తుర్కగూడ చేరుకుంటున్నారు. ఈక్రమంలో ఎస్సీ కమ్యూనిటీ భవనం వెనుకాల తవ్విన గుంతను పూడ్చకపోవడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

యథేచ్ఛగా రోడ్ల ఆక్రమణ

నిర్భయంగా వ్యాపారాలు.. రోడ్ల విస్తరణకు ఆక్రమణలను తొలగించినా మళ్లీ యథాస్థితి

ఇరుకు రోడ్లతో తరచూ ట్రాఫిక్.. ఇబ్బందుల్లో ప్రజలు, వాహనదారులు



ఆక్రమణలతో ఇరుకుగా మారిన మాడ్గుల రోడ్డు

ఆమనగల్లు, మే9 (ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు పట్టణంలోని రోడ్లను నిర్భయంగా ఆక్రమించేస్తున్నారు. రహదారికి ఇరువైపులా చిరు వ్యాపారుల మొదలు, దుకాణదారుల వరకు యథేచ్ఛగా వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. ఆక్రమణల కారణంగా వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రోడ్లను ఆక్రమించి వ్యాపారం సాగిస్తున్నా ఎవరూ పట్టించుకోకపోవడంతో విమర్శలకు తావిస్తోంది. రోడ్డు వెంట వ్యాపారం సాగించడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగడంతో పాటు తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

ఆమనగల్లు పట్టణం రాష్ట్ర రాజధానికి చేరువలో ఉండి నాలుగు మండలాలకు ప్రధాన కూడలిగా ఉంది. దీంతో వ్యాపార పరంగా అభివృద్ధి చెందుతుండడంతో స్థానికులతో పాటు చుట్టు పక్కల మండలాల వారు బతుకుదెరువు కోసం ఆమనగల్లుకు వచ్చి ఏదో ఒక చిరు వ్యాపారం సాగిస్తున్నారు. దుకాణాల అద్దెలు చెల్లించలేక విధిలేక రోడ్ల పక్కనే షెడ్లు, డబ్బాలు, కొట్లు, ఏర్పాటు చేసుకొని వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. దీంతో రోడ్ల ఆక్రమణ నానాటికి అధికమవుతుంది. ప్రదానంగా శ్రీశైలం - హైద్రాబాద్ జాతీయ రహదారి నుంచి మాడ్గుల మండల కేంద్రానికి, గాంధీ చౌక్ నుంచి గ్రామ పంచాయతీ మీదుగా పాత బజార్‌కు వెళ్లే రోడ్డు, రాజీవ్ చౌక్ నుంచి బస్టాండ్ మీదుగా షాద్‌నగర్ వెళ్లే రోడ్డు ఆక్రమణలతో పూర్తిగా కుచించుకుపోయి ప్రమాదకరంగా తయారయ్యాయి. రాజీవ్ చౌరస్తా మూలమలుపు నుంచి గాంధీచౌక్ వరకు గల రోడ్డు ఇటీవల ఆక్రమణలు అధికమయ్యాయి. బాలుర ఉన్నత పాఠశాల వైపు చిరు వ్యాపారులు కొట్లు, చిన్న చిన్న వ్యాపారులు, తోపుడు బండ్లు ఏర్పాటు చేసుకొని వ్యాపారాలు చేస్తున్నారు. అసలే ఇరుకు రోడ్డు... దీనికి తోడు వివేకానంద విగ్రహం వైపు కూడ కొందరు పండ్లు, పోలీస్ స్టేషన్ వెనుక చేపలు, గాంధీ చౌక్ వద్ద కూరగాయల మార్కెట్లు, ప్రైవేట్ వాహనాల, ఆటోల పార్కింగ్‌తో ఎదురెదురుగా వాహనాలు వస్తే కదలలేని పరిస్థితి ఏర్పడింది. అసలే వ్యాపారుల ఆక్రమణలతో రోడ్డు ఇరుకుగా మారగా, దానికి తోడు కొనుగోలు దారులు, ప్రయాణికులు రోడ్లపక్కనే వాహనాల పార్కింగ్ చేస్తున్నారు. రోడ్ల నిర్వహణ సరిగాలేక, చిరు వ్యాపారులు మలిన పదార్థాలు, చెత్త రోడ్లపైనే పారబోస్తున్నారు. గాంధీ చౌక్ వద్ద ప్రైవేట్ వాహనాల పార్కింగ్‌తో పరిస్థితి మరీ ఇబ్బందికరంగా మారింది. సంతరోజు శుక్రవారం ఈ రోడ్డుపై రాకపోకలకు ప్రజలు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. షాద్‌నగర్‌రోడ్డు పరిస్థితి ఇదేవిధంగా ఉంది. అదే రోడ్డులో బస్టాండ్ వైపు వాహనాల పార్కింగ్‌తో బస్సులు బస్టాండ్‌లోకి వెళ్లలేని పరిస్థితి. బస్టాండ్ దుకాణాల ముందు వాహనాల పార్కింగ్, చిరు వ్యాపారుల ఆక్రమణల మూలంగా ఈ రోడ్డుపై ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. అదేవిధంగా శ్రీశైలం - హైదరాబాద్ జాతీయ రహదారిని కూడా నిర్భయంగా ఆక్రమిస్తూ వ్యాపారాలు సాగిస్తున్నా ఎవరికీ పట్టింపు లేదు. రోడ్డు విస్తరణలో ఆక్రమణలను తొలగించిన మళ్లి ఇటీవల యథాస్థితి పరిస్థితి నెలకొంది. పండ్ల వ్యాపారులు, పూల దుకాణదారులు, టీకొట్లు, టిఫిన్ సెంటర్లు, తోపుడు బండ్లవారు రోడ్డును పావు వంతు ఆక్రమించి వ్యాపారం నిర్వహిస్తుండడం.. వాటి ముందు ఇష్టానుసారం వాహనాలకను పార్కింగ్ చేస్తుండడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు చొరవ తీసుకొని ఆక్రమణలను తొలగించి రాకపోకలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



రోడ్డు ఆక్రమిస్తే చర్యలు తప్పవు..



రోడ్లు ఆక్రమణలు చేస్తే చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే చాలా వరకు రోడ్ల విస్తరణ కోసం ఆక్రమణలను తొలగించడం జరిగింది. చిరు వ్యాపారులు రోడ్లను ఆక్రమించి రాకపోకలకు ఇబ్బందులు కలిగించవద్దు. పలు చోట్ల ఆక్రమణల తొలగింపునకు ఉన్నతాధికారులకు నివేదించాం. దుకాణాల ఎదుట వాహనాలు పార్కింగ్ చేయకుండా ట్రాఫిక్ పోలీసులకు సమాచారం ఇస్తాం.

శంకర్ నాయక్,
మున్సిపల్ కమిషనర్, ఆమనగల్లు

రైతులు వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి




శంషాబాద్ రూరల్ : జూకల్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

శంషాబాద్ రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటించాలని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ సూచించారు. రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని జూకల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు అధునిక వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు మాట్లాడుతూ రైతులు యూరియా తక్కువ వాడాలని, సాగు ఖర్చును తగ్గించుకోవాలని, అవసరం మేరకు రసాయనాలను వినియోగించాలన్నారు. పంట మార్పిడితో తక్కువ పెట్టుబడితో పాటు ఎక్కువ లాభం వచ్చేలా ప్రణాళిక వేసుకోవాలని సూచించారు. పాల్మాకుల పీఏసీఎస్ ఛైర్మన్ కె.శ్రవణ్‌కుమార్ గౌడ్, మాజీ జడ్పీటీసీ తన్వీరాజు, ఏడీఏ కవిత, ఏవో శ్వేత, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

రసాయన ఎరువులు తక్కువగా వాడాలి

ఇబ్రహీంపట్నం: అవసరం మేరకే రసాయన ఎరువులు వినియోగించి భూసారాన్ని పరిరక్షించుకోవాలని రాష్ట్ర రైతు కమిషన్ సభ్యుడు రాములు నాయక్ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని పోల్కంపల్లిలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా ముఖ్యఅతిథిగా హాజరై వ్యవసాయంలో పాటించే మెళకువలపై రైతులకు అవగాహన కల్పించారు. బిందు, తుంపర సేద్యంతో ఉద్యానవన పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. పంట మార్పిడి విధానాన్ని విధిగా పాటించాలన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు సునీత, శ్రీనివాస్‌రెడ్డిలు మాట్లాడుతూ ఈ ప్రాంతం హైదరాబాద్ నగరానికి దగ్గరగా ఉన్నందున కూరగాయల సాగును ప్రోత్సహించాలన్నారు. ఏవో విద్యాధరి మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని డిజిటలైజ్ చేయాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమం చేపట్టామని, భూమి కలిగి ఉన్న రైతులందరూ దీనిని తప్పనిసరిగా వినియోగించుకోవాలని సూచించారు. ఏఈవోలు శ్రవణ్‌కుమార్, సృజన రైతులు పాల్గొన్నారు.

విరబూసిన చెట్టు



మండు వేసవిలో చెట్ల ఆకులన్నీ రాలిపోయి చెట్లు మొత్తం విరబూసి ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. దుద్యాల రోడ్లకు ఇరువైపులా ఎవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా నాటిన మొక్కలు ఏపుగా పెరిగి ప్రయాణికులకు నీడనిస్తున్నాయి. ప్రస్తుతం ఎండలు దంచి కొడుతున్న కూడా రోడ్ల వెంబడి ఎక్కడ చూసినా చెట్లకు పూసిన పుష్పాలు ప్రయాణికులకు అబ్బురపరుస్తున్నాయి.

దుద్యాల, మే 9 (ఆంధ్రజ్యోతి)

జోరుగా మట్టి దందా

సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు.. పట్టించుకోని అధికారులు



జేసీబీ సహాయంతో మట్టిని టిప్పర్‌ల ద్వారా తరలిస్తున్న దృశ్యం

మోమిన్‌పేట్, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేసారం గ్రామ సమీపంలోని ఓ వెంచర్‌లోకి అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. అదే గ్రామానికి చెందిన రైతు పట్టాభూమి సర్వే నం.225లో నుంచి దర్జాగా టిప్పర్‌ల ద్వారా మట్టిని తరలిస్తున్నారు. మోమిన్‌పేట్ నుంచి తాండూర్‌కు వెళ్లే రోడ్డు సమీపంలో ఉన్న గుట్టను యంత్ర పరికరాలతో పెకిలించి వెంచర్‌లో అంతర్గత రోడ్లకు పోస్తున్నారు. దాదాపు 6 నుంచి 7 వెంచర్లు గ్రామ సమీపంలో వెలిశాయి. ఈ విషయంపై వెంచర్ సూపర్‌వైజర్‌ను ప్రశ్నిస్తే నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చాడు. మైనింగ్ శాఖ నుంచి అనుమతులున్నాయా అని అడిగితే లేవని సమాధానం దాటవేశారు. మండలంలోని కేసారం, దేవరంపల్లి, చీమలదరి, రావుల్‌పల్లి, మేకవనంపల్లి, మోమిన్‌పేట్, కొత్తకొల్కుంద, ఎన్కతల, గోవిందాపూర్, చక్రంపల్లి, టేకులపల్లి గ్రామాల్లో పుట్టగొడుగుల్లా వెంచర్లు వెలుస్తున్నాయి. ఎవరైనా ప్రశ్నిస్తే అధికార పార్టీకి చెందిన నాయకులదని సమాధానం చెబుతున్నారు.



గుట్టల నుంచి మట్టి తరలింపు

వెంచర్ల కోసం సహజసిద్ధంగా ఏర్పడిన గుట్టలను నేల మట్టం చేస్తున్నారు. గోవిందాపూర్ గ్రామంలో హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి ఆ గ్రామంలో ప్రభుత్వం నిర్మించిన చెక్ డ్యామ్ మధ్య నుంచి దర్జాగా తన పొలం వరకు వెళ్లేందుకు రోడ్డు వేశాడు. చుట్టుపక్కల రైతులు అడిగితే అందరికీ వెళ్లేందుకు ఉపయోగపడుతుందని సమాధానం చెబుతున్నాడు. 15 రోజుల క్రితం ఎన్కతల గ్రామంలో హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి చిన్నచెరువు సమీపంలోని శిఖం కబ్జా చేసిన సంగతి తెలిసిందే. ఈ విషయాన్ని గ్రామస్తులు స్పీకర్ దృష్టికి తీసుకెళ్తే ఇరిగేషన్, రెవెన్యూ శాఖ సిబ్బంది సహాయంతో కబ్జా నుంచి శిఖం భూమిని కాపాడారు. మోమిన్‌పేట్ మండలంలోని గుట్టలను జేసీబీలతో పెకిలించి మట్టిని వెంచర్లకు మట్టిని తరలిస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మట్టి దందాకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై డిప్యూటీ తహసీల్దార్ సురేశ్ వివరణ కోరగా అక్రమంగా మట్టి తరలిస్తున్నారన్న విషయం తమ దృష్టికి రాలేదన్నారు. మండలంలో ఎక్కడైనా అక్రమంగా మట్టిని తరలిస్తున్నట్లు సమాచారం వస్తే చట్టరీత్యా చర్యలు తీసుకొని వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

సంప్రదాయ ఆహార అలవాట్లే శ్రేయస్కరం



ఆహారోత్సవ్‌లో చైర్మన్ గోవింద్‌రెడ్డి

కీసర రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): సంప్రదాయ ఆహార అలవాట్లే శ్రేయస్కరమని కేజీఆర్ కళాశాల చైర్మన్ కె.గోవింద్ రెడ్డి అన్నారు. నాగారం మున్సిపాలిటీ రాంపల్లిలోని కేజీఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాలలో శుక్రవారం ఆహారోత్సవ్-2025 నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల వంటలను సిద్ధం చేసి, ప్రదర్శనకు పెట్టారు. చైర్మన్ గోవింద్‌రెడ్డి, డైరెక్టర్ రమణారావు, తదితరులు విద్యార్థులు తయారు చేసిన వంటలను, సలాడ్స్‌ను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు ప్రొఫెసర్ విజయ్‌కుమార్, ప్రొఫెసర్ విజయలక్ష్మి, డాక్టర్ శిల్పిక స్రవంతి, నాగరాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రేపటి నుంచి వీరబ్రహ్మేంద్ర స్వామి జాతర

బషీరాబాద్, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పర్వత్‌పల్లిలో ఆదివారం (రేపు) నుంచి వీరబ్రహ్మేంద్రస్వామి జాతర కొనసాగుతాయని ఆలయ కమిటీ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం గంగాపూజ, స్వస్తి పుణ్యావచనం, ధ్వజారోహణం, శిఖరపూజ, నాంది సమారాధనం, అంకురార్పణం, నవగ్రహపూజ, హోమం, సాయంత్రం 5గంటలకు శ్రీ గోవిందమాంబ వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం, రాత్రి 11గంటలకు రథోత్సవం, భజన ఉంటాయన్నారు. 12న ఉదయం 6గంటలకు అభిషేకం, 7గంటలకు పల్లకీసేవ, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం పోలేరమ్మకు బోనాలు, భజన ఉంటాయన్నారు.

మట్టి విగ్రహాలే జీవనాధారం

- నిరుడు వ్యాపారంలో తీరని నష్టం
- అప్పుల ఊబిలో విగ్రహాల తయారీదారు
- రుణం ఇచ్చేందుకు ముందుకు రాని బ్యాంకులు
- ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూపులు

ధారూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): మట్టి విగ్రహాలు తయారు చేయడంలో ఆయన సిద్ధహస్తుడు. తన కున్న కళనే జీవనాధారంగా మలుచుకున్నాడు. పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలు మాత్రమే ఏర్పాటు చేసుకోవాలని గతంలో ప్రభుత్వం ప్రకటించడంతో వ్యాపారం బాగా సాగుతుందని సంబురపడిపోయాడు. కానీ ఆయన ఆశలు అడియాశలయ్యాయి. ఊహించినంతగా వ్యాపారం జరగలేదు. దీంతో తయారు చేసిన విగ్రహాలకు పెట్టిన పెట్టుబడి కాస్త అప్పుల రూపంలో భారమైంది. అప్పులు తీర్చేందుకు తనకున్న పొలాన్నీ అమ్ముకోవాల్సివచ్చింది. తనకు సాయంగా ఉంటారని ఇద్దరు కుమారుల చదువునూ ఆపివేయించాల్సి వచ్చింది. ఇదీ ఓ విగ్రహాల తయారీదారుడి జీవనగాథ ఇది. ధారూరు మండలంలోని అంపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి రాఘవేందర్ హైదరాబాద్‌లోని బాలానగర్‌లో 2015లో వివిధ విగ్రహాల తయారీ చేయడం నేర్చుకున్నాడు. ఆ తర్వాత తన గ్రామానికి వచ్చి విగ్రహాలను తయారుచేసి విక్రయించే వ్యాపారం ప్రారంభించాడు. కాగా గతంలో పీవోపీ విగ్రహాలు తయారు చేయొద్దని, పర్యావరణ పరిరక్షణకు మట్టివిగ్రహాలనే మండపాల్లో ఏర్పాటు చేసుకోవాలని ప్రభుత్వం ప్రకటించటంతో రాఘవేందర్ పెద్దఎత్తున మట్టి విగ్రహాలను తయారు చేశాడు. ఈ మట్టి విగ్రహాలకు గిరాకీ రాక పెట్టిన పెట్టుబడి చేతికి రాక దాదాపు రూ.15లక్షల వరకు నష్టపోయాడు. దీంతో అప్పులు పెరగడంతో తనకున్న పొలాన్ని అమ్మేసి కొంత బాకీని తీర్చాడు. అయినప్పటికీ మరికొంత అప్పు మిగిలిపోయి ఆర్థిక కష్టాల్లో జీవనం కొనసాగిస్తున్నాడు. ప్రస్తుతం ధారూరులో స్థలం కిరాయికి తీసుకుని పీవోపీ గణపతి విగ్రహాల తయారీ పనిలో నిమగ్నమయ్యాడు. తన ఇద్దరు కుమారులైన శ్రీశైలం, శంకరుల చదువు మాన్పించి విగ్రహాల తయారీలో తనకు సాయంగా పెట్టుకున్నాడు.



తయారవుతున్న గణపతి విగ్రహాలు



గణపతి విగ్రహాల తయారీలో కుమ్మరి రాఘవేందర్

గణపతి విగ్రహాలతో పాటు, అమ్మవారి విగ్రహాలు, ఇతర విగ్రహాలను కూడా తయారుచేయడంలో ఆయన సిద్ధహస్తుడు. ప్రస్తుతం పది, ఐదు ఫీట్ల విగ్రహాలను తయారుచేస్తున్నారు. వినాయక చవితికి, దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు విగ్రహాల ఆర్డర్లు తీసుకుని తయారు చేస్తామని ఆయన తెలిపాడు.

ప్రభుత్వం ఆర్థికంగా చేయూతనందించాలి



జీవనాధారం కోసం పెట్టుకున్న విగ్రహాల వ్యాపారంలో నష్టం వచ్చి ఆర్థికంగా కష్టాల్లో ఉన్నాను. ఈ విగ్రహాల వ్యాపారం జరగక రూ.15లక్షల వరకు నష్టపోయి అప్పులపాలయ్యా. పెట్టుబడికి బ్యాంకులు రుణం ఇవ్వడం లేదు. ప్రభుత్వం ఆర్థికంగా చేయూతనిచ్చి ఆదుకోవాలి.

- కుమ్మరి రాఘవేందర్, విగ్రహాల తయారీదారు, అంపల్లి, ధారూరు మండలం

పాఠ్యపుస్తకాలు రెడీ

(ఐదో పేజీ తరువాయి)

అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. బడులు ప్రారంభమైన రోజే విద్యార్థుల చేతిలో పుస్తకాలు ఉండేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

2 నుంచి 9వ తరగతి వరకు ద్విభాషలో..

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ఒకటవ తరగతి విద్యార్థులకు పూర్తిగా ఇంగ్లిష్ మీడియం పుస్తకాలను అందిస్తున్నారు. 2వ తరగతి నుంచి 9వ తరగతి వరకు చదివే విద్యార్థులకు ద్విభాషా పుస్తకాలను అందిస్తున్నారు. మొదటి విడతలో పార్ట్-1 పుస్తకాలను జూన్ 12న అందించనున్నారు. పార్ట్-1 విభాగంలో 1వ తరగతి విద్యార్థులకు పూర్తిగా ఇంగ్లిష్ మీడియం మొత్తం పుస్తకాలు, 2 నుంచి 9వ తరగతి విద్యార్థులకు తెలుగు, హిందీ, ఇంగ్లిష్ లాంగ్వేజ్‌లతోపాటు ద్విభాషా పుస్తకాలు 50 శాతం ఆప్షన్స్ సబ్జెక్టులు(మ్యాథ్స్ సైన్స్ సోషల్), 10వ తరగతి విద్యార్థులకు తెలుగు మీడియం, ఇంగ్లిష్ మీడియం మొత్తం పుస్తకాలను అందించనున్నారు. పార్ట్-2 విభాగంలో 2వ తరగతి నుంచి 9వ తరగతి వరకు సగం సిలబస్ పూర్తయిన తర్వాత మిగిలిన 50 శాతం ఆప్షన్ సబ్జెక్టుల పుస్తకాలను అందించనున్నారు.

మేడ్చల్ జిల్లాలోని పాఠశాలలు

ప్రాథమిక	375
ప్రాథమికోన్నత	22
ఉన్నత	108
ఎయిడెడ్	10
మొత్తం	515

పాఠశాలలకు చేరవేస్తున్నాం

జిల్లాకు ఇప్పటికే దాదాపు 70 శాతం పుస్తకాలు చేరాయి. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పుస్తకాలను చేరవేస్తున్నాం. మరో పది రోజుల్లో మిగిలిన పుస్తకాలు రానున్నాయి. రాగానే మిగిలిన పుస్తకాలను పాఠశాలలకు పంపిణీ చేస్తాం. విద్యాసంవత్సరం ప్రారంభం రోజు వరకు వంద శాతం పుస్తకాలు సిద్ధంగా ఉంటాయి.

- సునీల్, జిల్లా పాఠ్యపుస్తక కేంద్ర నిర్వాహకులు

మున్సిపల్ కార్మికుడి నిజాయితీ



కార్మికుడు కిష్టయ్యను సన్మానిస్తున్న మున్సిపల్ కమిషనర్, కాలనీవాసులు

పరిగి, మే 9 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుడు కిష్టయ్య నిజాయితీ అభినందనీయమని పరిగి మునిసిపల్ కమిషనర్ వెంకటయ్య అన్నారు. చెత్తబండి డ్రైవర్ కిష్టయ్య పదవవార్డులోని శ్రీనివాసనగర్‌కాలనీకి చెందిన వెంకట్‌రెడ్డి సతీమణి చెత్తతోపాటు కవర్‌తో ఉన్న అర తులం కమ్మలను చెత్తబండిలో వేసింది. కొద్ది సేపటి తర్వాత కమ్మలు ఉన్న కవర్ కనిపించకపోవడంతో చెత్తబండి డ్రైవర్ కిష్టయ్యను పిలిచి ఇలా జరిగిందని చెప్పారు. దీంతో కిష్టయ్య డంపింగ్‌యార్డులో వెతికి ఆ కవరును నిజాయితీతగా వెంకట్‌రెడ్డికి అప్పగించాడు. ఈ సందర్భంగా కిష్టయ్యను కమిషనర్, కాలనీవాసులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ నరేష్ పాల్గొన్నారు.

ఘనంగా మహారాణా ప్రతాప్ జయంతి



మహారాణా ప్రతాప్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): తొలి స్వాతంత్ర్య సమరయోధుడు, మహారాణా ప్రతాప్ జయంతి ఉత్సవాలు శుక్రవారం రాజ్‌పుత్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తాండూరు పట్టణంలోని కాళికాదేవి ఆలయం నుంచి ఖాంజాపూర్ గేటువద్ద ఉన్న మహారాణా ప్రతాప్ విగ్రహం వరకు ఊరేగింపు నిర్వహించి ఆయన విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు రాజ్‌కుమార్, రిటైర్డ్ ఏఎస్పీ మధుసూదన్‌రావు, మాజీ కౌన్సిలర్ సూరజ్‌సింగ్‌ఠాకూర్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎల్‌వోసీ అందజేత

యాలాల, మే 9, (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న వారి కుటుంబాలకు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఎల్‌వోసీ అందజేశారు. రాఘవాపూర్ గ్రామానికి చెందిన మ్యాతరి అనంతయ్య, పగిడియాల గ్రామానికి చెందిన నేత వెంకటమ్మలు అనారోగ్యంతో బాధపడుతున్నారు. వీరు హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి బాధిత కుటుంబాలను కలిశారు. అనంతరం రూ.2లక్షల 50వేల చొప్పున ఇరువురు బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాఘవాపూర్ అమర్నాథ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పగిడియాల్ రఘురాంరెడ్డి తదితరులు ఉన్నారు.

దుద్యాల పీఎస్‌లో పూర్తి స్థాయి సేవలు



మాట్లాడుతున్న ఎస్ఐ యాదగిరి

దుద్యాల, మే 9 (ఆంధ్రజ్యోతి): దుద్యాల పీఎస్‌లో పూర్తిస్థాయి సేవలు అందుబాటులోకి వచ్చినట్లు ఎస్ఐ యాదగిరి తెలిపారు. మండల కేంద్రంలో గత సంవత్సరం డిసెంబరు 26న తాత్కాలిక భవనంలో పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి నేటి వరకు ఆన్‌లైన్ సేవలు, ఎఫ్ఐఆర్ కేసులు నమోదు కాలేదు. అయితే ప్రస్తుతం ఆన్‌లైన్ సేవలు, ఎఫ్ఐఆర్ కేసుల నమోదు అందుబాటులోకి వచ్చాయని ఎస్ఐ తెలిపారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ.. సాంకేతిక పరికరాలు రావడంతో పూర్తిస్థాయిలో సేవలు అందుబాటులోకి వచ్చినట్లు తెలిపారు. మండల ప్రజలు పోలీస్‌స్టేషన్ పరిధిలో కేసులు, సమస్యలు ఉంటే ఫిర్యాదు చేసుకోవచ్చని అన్నారు. ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి రావడంతో గత నాలుగు నెలలుగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తొలగనున్నాయి. మండలంలోని చిలుముల్‌మైలారం గ్రామంలో రెండు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సైనికులకు ప్రతీఒక్కరు అండగా నిలవాలి



మాట్లాడుతున్న బీజేపీ మండల అధ్యక్షుడు శ్రవణ్‌గౌడ్

బొంరాస్‌పేట్, మే 9 (ఆంధ్రజ్యోతి): దేశ సరిహద్దుల్లో భారత్-పాక్ మధ్య జరుగుతున్న యుద్ధ వాతావరణంలో ప్రతీఒక్కరు సైనికులకు అండగా నిలవాలని బీజేపీ మండల అధ్యక్షుడు శ్రవణ్ గౌడ్ పిలుపునిచ్చారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ మానసికంగా సైనికులకు ధైర్యం ఇచ్చే విధంగా దేశ పౌరులు కలిసికట్టుగా త్రివిధ దళాలకు అండగా నిలవడం గొప్ప విషయం అన్నారు. సరిహద్దులో సైనికులు ప్రాణాలను పణంగా పెట్టి పోరాడంతోనే ప్రశాంతంగా జీవించగలుగుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నాగురావు, నర్సింహులు, నాయక్, రాములు, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

13న ఆలయ భూముల కౌలుకు వేలం

కులకచర్ల, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండవెల్కిచర్ల పాంబండ శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయ భూములను సాగు చేసేందుకు కౌలు హక్కులు పొందేందుకు ఈనెల 13న ఆలయ ఆవరణలో వేలం నిర్వహించనున్నట్లు చైర్మన్ కోట్ల మైపాల్‌రెడ్డి, ఈవో బాలనర్సయ్య శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వేలం పొందిన రైతులు మూడు సంవత్సరాలు భూములు సాగు చేసుకోవచ్చని తెలిపారు. మండలంలోని బండవెల్కిచర్ల గ్రామపరిధిలోని సర్వే నెం.257లో 5ఎకరాల 22 గుంటలు, 258లో ఎకరాల 9గుంటలు, 259లో 37గుంటలు, ఘనపూర్ గ్రామపరిధిలోని సర్వేనెం.51లో రెండెకరాల 24గుంటలు, అంతారం గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 5లో 14 గుంటలు, దోమ మండలంలోని తిమ్మాయిపల్లి గ్రామపరిధిలోని సర్వే నెంబర్ 54లో ఎకరా 21గుంటలు భూములు ఉన్నాయి. వేలంలో పాల్గొనే వారు ముందుగా రూ.5వేలు డిపాజిట్ చేయాలని నిబంధనలు వర్తిస్తాయని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొడంగల్, మే 9 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ పట్టణంలో నూతన 11 కేవీ విద్యుత్ లైన్ పనుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కార్గిల్, సన్‌సిటీ, లాహోటీ కాలనీల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

మేడ్చల్ టౌన్: గుండ్లపోచంపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో చేపడుతున్న మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.

నర్సరీల్లో మొక్కలను కాపాడాలి



నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న గ్రామ ప్రత్యేకాధికారి వెంకటేశ్

బషీరాబాద్, మే 9(ఆంధ్రజ్యోతి): నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా కాపాడాలని గ్రామ ప్రత్యేకాధికారి, బషీరాబాద్ తహసీల్దార్ వై.వెంకటేశ్ కార్యదర్శికి సూచించారు. మండలంలోని మంతన్‌గౌడ్‌తండా పంచాయతీని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించి కార్యదర్శితో ఆయన చర్చించారు. గ్రామ సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం నర్సరీలోని మొక్కలను పరిశీలించి, మొక్కల సంరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



ధ్వజస్తంభం ప్రతిష్ఠాపనలో భక్తులు

కులకచర్ల, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పీరంపల్లి గ్రామంలో శుక్రవారం అంజనేయస్వామి ఆలయం ముందు ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనను వైభవంగా నిర్వహించారు. రెండు రోజులుగా గ్రామస్థులు ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

క్రీడల్లో ప్రతిభ చాటాలి



సుల్తాన్‌పూర్‌లోని ఎన్‌బీహెచ్‌ఎస్‌లో క్రీడాకారులతో పరశురాంరెడ్డి, హన్మంత్

పరిగి, మే 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, యువత విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలని పరిగి ఏఎంసీ చైర్మన్ బి.పరశురాంరెడ్డి, ఎన్‌బీహెచ్‌ఎస్ డైరెక్టర్ కె.హన్మంత్‌ముదిరాజ్‌లు ఉన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని సుల్తాన్‌పూర్‌లోని ఎన్‌బీహెచ్‌ఎస్‌లోని సమ్మర్ క్యాంపులో క్రీడలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఇ.కృష్ణ, ఎస్టీసెల్ అధ్యక్షుడు తావుర్యానాయక్, నాయకులు శ్రీనివాస్, ఆనంద్, సమ్మర్ క్యాంపు పీఈటీలు జె.శ్రీనివాస్‌నాయక్, రమేశ్, రిషి పాల్గొన్నారు.

సందీప్‌కు ఘన నివాళి



సందీప్‌కు నివాళులర్పిస్తున్న కీసర గ్రామస్థులు

కీసర, మే9(ఆంధ్రజ్యోతి): నక్సలైట్లు పెట్టిన మందుపాతర పేలి వీర మరణం పొందిన గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ తిక్క సందీప్‌కు శుక్రవారం కీసరలో ఘనంగా నివాళులర్పించారు. మండల ఎమ్మార్పీఎస్ అధ్వర్యంలో కీసర ప్రధాన చౌరస్తాలో తిక్క సందీప్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

బస్సును పునరుద్ధరించాలి

ధారూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోమిన్‌కుర్దు గ్రామానికి బస్సును పునరుద్ధరించాలని గ్రామస్థులు కోరారు. బస్సు సౌకర్యం నిలిపివేయటంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. నాలుగు రోజులుగా బస్సు రాకపోకలు నిలిచిపోయాయని వారు చెప్పారు. అంతకుముందు వికారాబాద్ నుంచి బొంరాస్‌పేట్ మీదుగా కొడంగల్‌కు వెళ్లే బస్సు గ్రామం మీదుగా రోజు మూడు ట్రిప్పులు నడిచేదని ప్రస్తుతం ఈ బస్సును సౌకర్యాన్ని నిలిపివేయడంతో వికారాబాద్, నాగారం వైపు వెళ్లే ప్రయాణికులకు ఇబ్బంది కలుగుతోందని వాపోయారు.

భూసమస్యల పరిష్కారానికి దరఖాస్తు చేసుకోవాలి



ధారూరు: కొండాపూర్‌కలాన్‌లో రెవెన్యూ సదస్సులో పాల్గొన్న ఆర్డీవో వాసుచంద్ర

కీసర, మే 9 (ఆంధ్రజ్యోతి): భూసమస్యల పరిష్కారానికి భూస్వాములు భూభారతి చట్టంలో భాగంగా ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేసుకోవాలని కీసర తహసీల్దార్ అశోక్ అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి ఆర్వోఆర్ చట్టంలో భాగంగా కీసర మండలానికి ప్రభుత్వం పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం కీసర రెవెన్యూ పరిధిలోని భోగారం, నాగారం, అహ్మద్‌గూడ ప్రాంతాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించినట్లు తహసీల్దార్ తెలిపారు. మొత్తం 130 దరఖాస్తులు వచ్చినట్లు అశోక్ తెలిపారు.

ధారూరులో 28 దరఖాస్తులు

ధారూరు: మండలంలోని కొండాపూర్‌కలాన్, ధర్మాపూర్ గ్రామాల్లో శుక్రవారం భూభారతి రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. కొండాపూర్‌కలాన్‌లో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో వికారాబాద్ ఆర్డీవో వాసు చంద్ర సందర్శించారు. సదస్సులో రైతుల నుంచి వచ్చిన 28 దరఖాస్తులను ఆయన పరిశీలించి భూసమస్యలపై రైతులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు సాజిదాబేగం, శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.



కీసర: రైతుల వద్ద నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ అశోక్

కొనుగోళ్లలో జాప్యం

(ఐదో పేజీ తరువాయి)

రోజుల్లోనే అయిపోయాయి. అప్పటి నుంచి నిర్వాహకులు సర్దుబాటు చేస్తూ బుధవారం వరకు నెట్టుకొచ్చారు. అప్పటి నుంచి గన్నీ బ్యాగులు లేకపోవడంతో ధాన్యం కుప్పలవద్దే రైతులు ఎదురు చూస్తున్నారు.

ఏటా ఇదే గోస

బొంరాస్‌పేట్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రానికి ప్రతి సీజన్‌లో ధాన్యం బస్తాల కొరత, సరైన సమయానికి లారీలు రాకపోవడం పరిపాటిగా మారింది. కేంద్రాలు ప్రారంభించే సమయంలో జిల్లా స్థాయి అధికారులు ఎన్నీ సమావేశాలు నిర్వహించినా బొంరాస్‌పేట్ మండల కేంద్రానికి మాత్రం సరైన న్యాయం చేయడం లేదని రైతులు వాపోతున్నారు. ప్రతీ సీజన్‌లో ఈ కేంద్రం నుంచి 25 వేల నుంచి 30 వేల బస్తాల వరకు ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నా రైతులు మాత్రం సరైన సమయంలో ధాన్యం కొనుగోళ్లు జరుగక ఇబ్బందులు పడుతున్నారు. ప్రతీ ఏడాది ఇదే తంతు నడుస్తుందని ఆరోపిస్తున్నారు.

వర్షాలతో గుబులు

కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చిన రైతులకు అధికారులు సహకరించడం లేదు. ధాన్యం బస్తాలు సకాలంలో అందించి ఉంటే మూడు రోజుల్లోనే దాదాపు 5 నుంచి 6 వేల బస్తాల ధాన్యం తూకాలు జరిగేవి. సరైన సమయంలో బస్తాలు అందించకపోవడంతో ధాన్యం రాశులు ఎక్కడికక్కడే ఉండిపోయాయి. సోమవారం నుంచి వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ఆలోగా ధాన్యం అమ్ముడవుతుందా అని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు.



కొనుగోలు కేంద్రం వద్ద నిల్వ ఉంచిన ధాన్యం

గ్రామాల్లో భయం.. భయం!

కులకచర్ల, మే 9 (ఆంధ్రజ్యోతి): చిరుత సంచరిస్తున్నట్లు అనుమానాలు వెలువడటంతో కులకచర్ల మండలంలోని లాల్‌సింగ్, జీతుల, గుడ్డిరూక్య, బండమీది తండాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. రెండు రోజుల కిందట లాల్‌సింగ్ తండాకు చెందిన సక్రియానాయక్ లేగదూడపై గుర్తుతెలియని జంతువు దాడి చేసింది. చిరుతనే అని తండాల ప్రజలు నమ్ముతున్నారు. కాగా ఈ తండాల చుట్టూ అటవీ ప్రాంతం ఉంది. చిరుత అడవిలో ఉండొచ్చని ప్రజలు నమ్ముతున్నారు. పశువులను పొలాల నుంచి ఇంటి దగ్గరికి తీసుకువస్తున్నారు. ప్రతీ సంవత్సరం వేసవిలో మండల పరిధిలోని ఏదో ఓ ప్రాంతంలో గుర్తుతెలియని జంతువు పశువులపై దాడి చేస్తున్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారులు తెలిపారు.

ప్రమాదాల మలుపు!

- సూచిక బోర్డుల ఏర్పాటులో అధికారుల నిర్లక్ష్యం

బషీరాబాద్, మే 9(ఆంధ్రజ్యోతి): గ్రామీణ రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం కోట్ల రూపాయలు కేటాయిస్తోంది. కానీ ప్రమాదకర మూల మలుపులను మాత్రం పట్టించుకోవడంలేదని పలువురు వాహనదారులు వాపోతున్నారు. బషీరాబాద్-తాండూరు ప్రధాన ఆర్‌అండ్‌బీ రోడ్డులో హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ సమీపంలోని మలుపు, నారాయణపూర్ గేటు వద్ద గల మూల మలుపులతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ మలుపుల్లో ప్రమాద హెచ్చరిక బోర్డుల లేక, వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇదంతా ఆర్‌అండ్‌బీ అధికారులకు తెలిసినా ఎవరూ పట్టించుకోవడంలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ రోడ్డులోని మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు అధికారులు ఏర్పాటు చేయించాల్సి ఉన్నా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ మలుపుల వద్ద వాహనాలు అదుపుతప్పి ఢీకొట్టి పలువురు గాయాల పాలై మృతి చెందిన ఘటనలు అనేకం ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మలుపుల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.



బషీరాబాద్-తాండూరు ప్రధాన రోడ్డులో ప్రమాదకర మూలమలుపు

12న కట్టమైసమ్మ జాతర



ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లు

శామీర్‌పేట, మే 9 (ఆంధ్రజ్యోతి): శామీర్‌పేట పెద్దచెరువు కట్ట మైసమ్మ అమ్మవారు జాతరను ఈ నెల 12న సోమవారం పెద్దఎత్తున నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాల్లో భక్తులు మైసమ్మ అమ్మవారుకు భారీఎత్తున బోనాలను సమర్పించనున్నారు. అందుకు ఆలయ కమిటీ చైర్మన్ మ్యాకల మహేందర్‌యాదవ్, కమిటీ సభ్యులు తగు ఏర్పాట్లు చేస్తున్నారు. అమ్మవారి ఆలయానికి రంగులు వేసి, ఆలయ ప్రాంగణంలో విద్యుత్ లైట్లను ఏర్పాటు చేశారు. తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చైర్మన్ తెలిపారు.